# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు






ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 361 పేజీలు : 04 వెల రూ. 2 శనివారం 15 - 08 - 2026


## యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మక మార్పు తీసుకొచ్చాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో జ్యోతిబా పులే, సావిత్రీబాయి పులే దంపతుల విగ్రహావిష్కరణ
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- విద్యావ్యవస్థను సమూల ప్రక్షాళన చేశామన్న సీఎం



**హైదరాబాద్ :**

ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా పులే విధానాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అన్నివర్గాలు ఒకేచోట చదువు, జీవించడం వల్ల కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. చదువుతో తలరాత మారి సమాజంలో గుర్తింపు లభిస్తుందని వివరించారు. హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో బీసీ సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన జ్యోతిబా పులే, సావిత్రీబాయి పులే దంపతుల విగ్రహాలను రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.విద్యా వ్యవస్థను సమూల ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యంగ్ ఇండియా పాఠశాలల ద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందే క్రెడిట్ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచే దీన్ని అమలు చేస్తున్నామన్న ఆయన, కళాశాలల్లో అడ్మిషన్లు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లోనే ఫీజు జమ అవుతుందని తెలిపారు.సాంకేతిక నైపుణ్యం ఉన్నవారికే ప్రపంచం - మిగతా 2 లో



## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు కేబినెట్ నిర్ణయం

- ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో
- సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 సదస్సు
- సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుకు నిర్ణయం

**హైదరాబాద్ :**

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో - మిగతా 2 లో

## నేను కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదు




- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- కాంగ్రెస్ పార్టీలో బయటి నుంచి వచ్చిన వారి పెత్తనం ఎక్కువయిందన్న రాజగోపాల్ రెడ్డి
- రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలతో పార్టీలో రేగిన దుమారం
- తాను పార్టీ నేతలను విమర్శించలేదన్న మునుగోడు ఎమ్మెల్యే

## స్వాతంత్ర్య దినోత్సవ వేళ బాంబు బెదిరింపులు



- దిల్లీలో హై అలర్ట్- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు దిల్లీకి వరుస బాంబు బెదిరింపులు
- ఎర్రకోట, దిల్లీ విమానాశ్రయంతో పాటు కీలక ప్రాంతాలకు బెదిరింపులు
- ఒక మెయిల్‌లో ఖలిస్థాన్, 1984 అల్లర్ల ప్రస్తావన

**ఢిల్లీ :**

స్వాతంత్ర్య వేడుకలకు ఒకరోజు ముందు దేశ రాజధాని దిల్లీలో బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. దిల్లీ హైకోర్టు, ఎయిర్‌పోర్ట్ సహా పలు ప్రభుత్వ కార్యాలయాలకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. దీంతో భద్రతా బలగాలు అప్రమత్తమై విస్తృత తనిఖీలు చేపట్టాయి. అయితే ఇదంతా ఆకతాయిల పనేనని, ఇవన్నీ నకిలీ బెదిరింపులేనని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు ఎర్రకోటలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవం కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.శుక్రవారం ఉదయం 11 గంటల 18 నిమిషాలకు దిల్లీ కంటోన్మెంట్ ఎస్‌డీఎం కార్యాలయానికి, ఆ తర్వాత - మిగతా 2 లో

## బంగ్లాదేశ్‌కు భారత రైల్వే కోచ్‌లు

- పదేళ్ల తర్వాత సరఫరా పునఃప్రారంభం
- దాదాపు దశాబ్దం తర్వాత బంగ్లాదేశ్‌కు భారత్ కోచ్‌ల సరఫరా పునఃప్రారంభం
- తొలి విడతగా 19 అత్యాధునిక బ్రాడ్ గేజ్ కోచ్‌ల డెలివరీ పూర్తి
- మొత్తం 200 కోచ్‌ల కొనుగోలు ప్రాజెక్టులో ఇది ఒక భాగం
- బంగ్లా రైల్వేలో పాత కోచ్‌ల స్థానంలో కొత్తవి ప్రవేశపెట్టడమే లక్ష్యం
- బంగ్లా ప్రభుత్వం, యూరోపియన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు నిధులతో ప్రాజెక్టు

**ఢిల్లీ :**

దాదాపు ఒక దశాబ్ద కాలం విరామం తర్వాత భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు ప్యాసింజర్ రైల్వే కోచ్‌ల సరఫరా మళ్లీ ప్రారంభమైంది. ఇందులో భాగంగా, 19 అత్యాధునిక బ్రాడ్-గేజ్ ప్యాసింజర్ కోచ్‌లతో కూడిన మొదటి బ్యాచ్‌ను సరిహద్దు - మిగతా 2 లో



## ఇరాన్ పోరులో అమెరికా బలగాల్లో మనోధైర్య సమస్య

- స్పందించిన రక్షణ మంత్రి
- హోర్ముజ్ పై నియంత్రణ సాధించామన్న ట్రంప్
- అమెరికా బలగాల్లో మనోధైర్యం క్షీణిస్తోందంటూ కథనాలు
- ఆ కథనాల్లో నిజం లేదన్న అమెరికా రక్షణ కార్యదర్శి



**ఢిల్లీ :**

ఇరాన్‌తో సైనిక ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, హర్మూజ్ జలసంధిపై అమెరికా నియంత్రణ సాధించిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో అమెరికా దళాలలో మనోధైర్యం క్షీణిస్తోందన్న కథనాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కథనాలను అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ తీవ్రంగా ఖండించారు. - మిగతా 2 లో

## సైన్యం కన్నా రైల్వేలపైనే కన్ను!




- భారత రైల్వే నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని ఐఎస్ఐ భారీ కుట్ర
- దాడులే కాకుండా, తప్పుడు సమాచారంతో భయాందోళనలు సృష్టించే పన్నాగం
- సైనిక స్థావరాల కంటే ఎక్కువగా రైల్వేలపై సమాచారం సేకరణ
- రూ.3,000 వంటి స్వల్ప మొత్తానికే ఏజెంట్ల నియామకం
- భారత రైల్వే స్టేషన్లలో నిఘా

## ప్రజానాడి




## 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలు



- ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రూ.40 కోట్ల విలువైన 58 అధునాతన ఫైర్ వాహనాలకు జెండా ఊపిన సీఎం చంద్రబాబు
- వీటిలో ఫైర్ ఫైటింగ్ వాహనాలు, వాటర్ బౌజర్లు, క్విక్ రెస్పాన్స్ వెహికల్స్ ఉన్నాయి
- ప్రమాదాలకు వేగంగా స్పందించి ఆస్తి, ప్రాణనష్టాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు - మిగతా 2 లో

## తాగునీటికే తొలి ప్రాధాన్యతమివ్వాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- రాష్ట్రంలో లోటు వర్షపాతం
- నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటినిల్వ, నీటి విడుదలపై సమీక్ష
- సమీక్షకు హాజరైన మంత్రి నిమ్మల, జలవనరులశాఖ ఉన్నతాధికారులు
- పోలవరంలో 89.9 శాతం సివిల్ పనులు పూర్తయినట్లు తెలిపిన అధికారులు




**అమరావతి :**

రాష్ట్రంలో వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వల్ని, భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలని దిశానిర్దేశం చేశారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పనుల పురోగతి సహా వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల తదితర అంశాలపై చర్చించారు.ఎల్‌నినో - మిగతా 2 లో

# సంపాదకీయం

## చదివే యువతే... చైతన్య సమాజానికి పునాది!



నేడు డిజిటల్ ప్రపంచం అపారమైన అవకాశాలను అందిస్తోంది. స్మార్ట్ ఫోన్, ఇంటర్నెట్, కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి సాధనాలు జ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చాయి. అయితే సమాచారం ఎక్కువగా ఉండడం మాత్రమే సరిపోదు. దాన్ని విశ్లేషించే శక్తి, నిజానిజాలను గుర్తించే వివేకం, విలువలతో కూడిన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కూడా అవసరం. ఈ సామర్థ్యాన్ని పెంపొందించేది పుస్తక పఠనమే.మనకు సమాచారం ఎక్కువగానే వస్తోంది. కానీ జ్ఞానం కూడా అంతే బాగా పెరుగుతోందా? ఒక ఐదు నిమిషాల వీడియో కొంత సమాచారం ఇవ్వవచ్చు. ఒక సోషల్ మీడియా పోస్ట్ ఓ వార్తను చెప్పవచ్చు. ఒక ఏఐ సాధనం క్షణాల్లో సమాచారం ఇవ్వవచ్చు. కానీ, జీవితాన్ని అర్థం చేసుకునే లోతైన ఆలోచన, మానవీయ విలువలు, నిర్ణయ సామర్థ్యం, సృజనాత్మకత... ఇవి పఠనం ద్వారానే పెరుగుతాయి. అందుకే పుస్తకం కేవలం కాగితాల సమాహారం కాదు. అది ఒక నిశ్శబ్ద గురువు. అది మనతో వాదిస్తుంది, మనల్ని ప్రశ్నిస్తుంది, మనలోని బలహీనతలను చూపిస్తుంది, కొత్త ప్రపంచాలను పరిచయం చేస్తుంది. ఒక మంచి పుస్తకం చదివిన తర్వాత మనం అదే వ్యక్తిగా ఉండిపోము. మన ఆలోచనల్లో ఒక కొత్త కిటికీ తెరుచుకుంటుంది.డిజిటల్ ప్రపంచంలో పెరిగిన నేటి యువత వేగంగా నేర్చుకుంటుంది. కొత్త సాంకేతికతను స్వీకరిస్తుంది. ప్రపంచంతో క్షణాల్లో అనుసంధానం అవుతుంది. కానీ, ఈ తరానికి అవసరమైనది లోతుగా చదివే అలవాటు. ఎందుకంటే వేగంగా సమాచారాన్ని చూడటం ఒక నైపుణ్యం అయితే, లోతుగా చదవడం ఒక వ్యక్తిత్వం. మనం తరచూ ఒక మాట వింటున్నాం "పిల్లలు చదవడం తగ్గిపోయింది" అని. ఈ సమస్యను యువతపై నెట్టివేయడం సరికాదు. వారు పుస్తకాల నుంచి దూరం కాలేదు, పుస్తకాలను వారి జీవితానికి దగ్గరగా తీసుకురావడంలో మనం వెనుకబడ్డాం. ఒక యువకుడికి పుస్తకం అతని కలలకు, కెరీర్‌కు, జీవితానికి ఎలా ఉపయోగపడుతుందో చూపించిన రోజే అతను స్వయంగా గ్రంథాలయం వైపు నడుస్తాడు.ప్రతి ఇంట్లో ఒక చిన్న గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి. తల్లిదండ్రులు పిల్లలకు బహుమతిగా పుస్తకాలు ఇస్తూ వారిలో చదివే అలవాటు పెంచాలి. ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠ్య పుస్తకాలతో పాటు స్ఫూర్తిదాయక గ్రంథాలను పరిచయం చేయాలి. గ్రంథపాలకులు గ్రంథాలయాన్ని యువత ఆలోచనలు వికసించే జ్ఞానవేదికగా తీర్చిదిద్దాలి. ప్రభుత్వం కూడా పఠన సంస్కృతిని బలోపేతం చేసే విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆధునిక గ్రంథాలయాలు, డిజిటల్ వనరులు, ఈ--పుస్తకాలు, ఆడియో పుస్తకాలు, గ్రామీణ ప్రాంతాల్లో పఠన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. ఖాళీగా ఉన్న గ్రంథపాలక పోస్టులను భర్తీ చేయాలి. ఇవన్నీ యువతకు జ్ఞాన వాతావరణాన్ని కల్పిస్తాయి. జాతీయ గ్రంథపాలక దినోత్సవం (ఆగస్టు 12) సందర్భంగా రోజుకు కొంత సమయాన్ని పఠనానికి కేటాయిద్దాం.

## ఇరాన్ పోరులో అమెరికా బలగాల్లో మనోధైర్య సమస్య?

**మొదటిపేజీ తరువాయి -** ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ 'యూఎస్ఎస్ అబ్రహం లింకన్'లో పరిస్థితులు క్షీణించాయంటూ వస్తున్న కథనాలు పూర్తిగా వాస్తవ దూరమని ఆయన స్పష్టం చేశారు.అయితే, మధ్యప్రాచ్యంలో ఇరాన్‌పై సుదీర్ఘంగా సాగుతున్న వైమానిక, నావికా దాడులు, కఠినమైన వాతావరణ పరిస్థితుల వల్ల అమెరికా వైమానిక, నావికా బలగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు అసోసియేటెడ్ ప్రెస్ వర్గాలు వెల్లడించాయి. హర్మూజ్ జలసంధి మార్గం ద్వారా వాణిజ్య నౌకల రాకపోకలను పునరుద్ధరించామని ట్రంప్ పేర్కొనగా... అమెరికా విధించిన ఆంక్షలు, దిగ్బంధనాన్ని అధిగమించేందుకు ఇరాన్ భద్రతా సవాళ్లను విసురుతూనే ఉంది. ఈ తరుణంలో మిలిటరీ దళాల్లో సరైన వసతులు, నిద్రలేమి, మానసిక ఒత్తిడికి సంబంధించి వస్తున్న వార్తలను అమెరికా రక్షణ శాఖ 'అతిశయోక్తి'గా అభివర్ణించింది.

## హద్దులు దాటొద్దు, భాష జాగ్రత్త!

**మొదటిపేజీ తరువాయి -** మార్గదర్శకాలు జారీ చేశారు. పార్టీ నేతలు, జనసైనికులు, వీర మహిళలు పోస్టులు పెట్టేటప్పుడు, వివిధ అంశాలపై స్పందించేటప్పుడు భాష విషయంలో సంయమనం పాటించాలని, పరిధి దాటవద్దని ఆయన స్పష్టంగా దిశానిర్దేశం చేశారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం మాట్లాడటం, అసభ్య పదజాలం ఉపయోగించడం సరికాదని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో, ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తరుణంలో పార్టీ ప్రతిష్ఠకు భంగం కలగకుండా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.రాజకీయ ప్రత్యర్థులు సోషల్ మీడియా ద్వారా పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించేందుకు చేసే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారి కుట్రలను తిప్పికొట్టాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. పార్టీ క్రమశిక్షణే అత్యంత కీలకమని, దానికి విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఈ ప్రకటన ద్వారా పార్టీ అధిష్ఠానం గట్టి హెచ్చరికలు పంపింది.ఇటీవల ఒంగోలులో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డిల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం నడిచిన నేపథ్యంలో, పవన్ కల్యాణ్ తాజా మార్గదర్శకాలు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మక మార్పు తీసుకొచ్చాం

**మొదటిపేజీ తరువాయి -** రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలుకుతోందన్న సీఎం, అలాంటి వారికి జర్మనీ, జపాన్, సౌత్ కొరియాలో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. కృత్రిమ మేధ వల్ల నిపుణుల ఉద్యోగాలు పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సంక్షోభాన్ని ఏ విధంగా ఎదుర్కోవాలనే దానిపై అందరూ ఆలోచించాలన్నారు. అందుకే విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని నేర్పిస్తున్నామన్నారు. సాంకేతిక నైపుణ్యం సాధించిన వారికి జర్మనీ, జపాన్, సౌత్ కొరియా పంపిస్తామన్నారు. ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగం, నజరానాలు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు."మహనీయుల విగ్రహాలు చూసి వారి త్యాగాలు, స్ఫూర్తి పొందాలి. చదువే ఆయుధంగా మారుతుందని జ్యోతిబా పూలే గుర్తించారు. ప్రజా పాలనలో జ్యోతిబా పూలే విధానాలు కొనసాగిస్తున్నాం. చదువు ద్వారా తలరాత మారుతుంది, ఆత్మగౌరవం, సమాజంలో గుర్తింపు వస్తుంది. అన్ని వర్గాలు ఒకేచోట చదువు, జీవించడం ద్వారా కుల వ్యవస్థ నిర్మూలన సాధ్యం. యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మక మార్పు తీసుకొచ్చామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

## నేను కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదు

**మొదటిపేజీ తరువాయి -** కాంగ్రెస్ పార్టీలో బయట నుంచి వచ్చిన వారి పెత్తనం ఎక్కువైందంటూ తాను చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో రాజకీయ చర్చ నడుస్తున్న వేళ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఎక్కడా కాంగ్రెస్ పార్టీ నాయకులను కానీ, పార్టీని కానీ విమర్శించలేదని... విమర్శించబోనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని... భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధి కూడా ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలోనే తాను కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతానని స్పష్టం చేశారు.పార్టీని నమ్ముకుని దశాబ్దాలుగా జెండా మోసిన అసలైన కాంగ్రెస్ నాయకులకు, తెలంగాణ ఉద్యమకారులకు ప్రజాపాలనలో తగిన గుర్తింపు లభించాలనే ఉద్దేశంతోనే తాను మాట్లాడానని ఆయన చెప్పారు. సీమాంధ్ర పాలకులు, కాంట్రాక్టర్ల చెప్పుచేతల్లో తెలంగాణ ప్రభుత్వం లేదా పార్టీ నడవకూడదని సూచించారు. ప్రజాపాలన అంటే కేవలం పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల కోసం కాదని... పేద ప్రజల సంక్షేమం కోసమే పనిచేయాలని స్పష్టం చేశారు.

# తాగునీటికే తొలి ప్రాధాన్యతమివ్వాలి

**మొదటిపేజీ తరువాయి -** ప్రభావం, లోటు వర్షపాతం, భూగర్భ జలాలు, తాగు నీటి సరఫరా, నిర్వహణా ప్రణాళిక, జలధార-జలహారతి కార్యక్రమాల అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో అధికారులతో పలు అంశాల గురించి చంద్రబాబు చర్చించారు. 89.9 శాతం పనులు పూర్తి: పోలవరం ప్రాజెక్టులో నిన్నటి (గురువారం) వరకూ 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తైనట్టు అధికారులు తెలిపారు. పోలవరం ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి అవుతున్నట్టు జలవనరుల శాఖ సీఎంకు వెల్లడించింది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1,గ్యాప్-2లో పనులు శరవేగంగా చేపట్టినట్టు తెలిపారు. డ్యామ్ సైట్ వద్ద రోడ్లు సహా పలు మౌలిక వసతుల పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు.ప్రాజెక్టు సమీపంలోని గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల సెంటిమెంట్‌ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఇటీవల కాలంలో 14 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాలు వచ్చినా పనులకు ఇబ్బంది లేకుండా కొనసాగించినట్టు అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి కల్లా విశాఖ వరకూ ఎడమ కాలువ బ్యాలెన్సు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనకాపల్లి వరకూ ఉన్న నీటి వనరులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీటిని నింపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పోలవరం కుడి ఎడమ కాలువల్లో 17,500 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అనుగుణంగా పనులు చేయాలని స్పష్టం చేశారు.రెండు కాలువలకూ మంచి పేర్లను సూచించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలోని ప్రాంతాలను సద్వినియోగం చేసుకోవటంతో పాటు పర్యాటకం గానూ తీర్చిదిద్దాలన్నారు. డేటా సెంటర్లకు నీటి అవసరాలపై కొందరు లేనిపోని విమర్శలు చేస్తున్నారని మొత్తంగా వాటికి 3.5 టీఎంసీల నీరే సరిపోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో తాగు నీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఆ తదుపరి పారిశ్రామిక అవసరాలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమీక్షకు మంత్రి నిమ్మల రామానాయుడు, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఉమ్మడి ప్రకాశం జిల్లా కరవు ప్రాంత ప్రజల కల త్వరలోనే సాకారం కానుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.ఈ ప్రాజెక్ట్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పోలవరం-భద్రాచలం మధ్య రివర్‌బేస్ పర్యాటకం అభివృద్ధి చేసే యోచనలో ఉన్నట్లు నిమ్మల తెలిపారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నీటిని ఈ నెలాఖరులో అనకాపల్లికి తీసుకెళ్తామన్నారు. దీని ద్వారా ఉత్తరాంధ్రకు పుష్కలంగా నీరు వెళు_ందని, డేటా సెంటర్లు, పారిశ్రామిక అవసరాలకు 3 టీఎంసీలు సరిపోతాయని మంత్రి నిమ్మల వివరించారు. ప్రాధాన్యత ప్రకారం 36 ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. సూపర్ ఎల్‌నినో దృష్ట్యా తాగునీటికే తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు.నీటి నిర్వహణలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పులిచింతలలో నీటినిల్వలో వాళ్లకు, మాకు చాలా తేడా ఉందని నిమ్మల పేర్కొన్నారు. ఎత్తిపోతల పథకాలను గత ప్రభుత్వం పూర్తిగా వదిలేసిందని, వీటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నమన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా ఎక్కడికక్కడ చర్యలు చేపట్టామన్నారు. వర్షాభావం వల్ల రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేయాలని సూచించారు. నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. పట్టిసీమ నీళ్లే ఇప్పుడు కృష్ణా డెల్టాకు వరంగా మారాయన్నారు.గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రవాహం బాగా తగ్గిందని, శ్రీశైలం, సాగర్‌కు వచ్చే నీటి ప్రవాహాలు తగ్గుతున్నాయని, పులిచింతలలో ప్రస్తుతం ఉన్న నీళ్లన్నీ గతేడాది నిల్వ చేసినవే అని తెలిపారు. ప్రాజెక్టులకు వర్షాలు, కాల్వల ద్వారా వచ్చే నీరు తగ్గుతోందని, పులిచింతల నుంచి రోజుకో టీఎంసీ తీసుకుంటే 20 రోజుల్లో ఖాళీ అవుతుందన్నారు. గోదావరి డెల్టాకు ప్రతిరోజు 15 వేల క్యూసెక్కులు వెళ్తోందని, నీళ్లను నిల్వ చేసుకోకుంటే తాగునీటికి సమస్యలు వస్తాయని హెచ్చరించారు. ముందుచూపు లేకుండా సాగుకు వదిలేస్తే అనేక కష్టాలు వస్తాయని, సాగర్‌కు నీళ్లు బాగా వస్తే సాగునీటికి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేళ బాంబు బెదిరింపులు

**మొదటిపేజీ తరువాయి -** ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్-3 కి, జామ్‌నగర్ హౌస్‌కు, సాకేత్ ఎస్‌డీఎం కార్యాలయానికి, ఝండే వాలన్‌కు వరుసగా బాంబు బెదిరింపు కాల్స్, ఈ-మెయిల్స్ వచ్చాయి. ఢిల్లీ హైకోర్టులో మధ్యాహ్నం 02:11 నిమిషాలకు పేలుడు జరుగుతుందని మెయిల్ రావడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఢిల్లీ పోలీసుల ఆధ్వర్యంలో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఈ ప్రాంతాలకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. అయితే ఎక్కడా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించకపోవడంతో ఇవి కేవలం నకిలీ బెదిరింపులేనని పోలీసులు నిర్ధారించారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.ఢిల్లీ హైకోర్టుకు వచ్చిన బెదిరింపు మెయిల్‌లో ఢిల్లీ ఖలిస్థాన్ అవుతుందని ఆగంతకులు హెచ్చరించారు. ఆగస్టు 15న బాంబుదాడులు చేస్తామని బెదిరించారు. 1984 సిక్కు వ్యతిరేక హింసాకాండకు బాధ్యులైన కాంగ్రెస్ నేతలపై చర్య తీసుకోవాలని మెయిల్‌లో డిమాండ్ చేశారు. ఖాకీ యూనిఫాంలో వచ్చే వ్యక్తులు ఎర్రకోటలో పేలుళ్లకు పాల్పడతారంటూ హెచ్చరించారు. ఖలిస్థాన్ మద్దతుదారులు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారని ఢిల్లీ నుంచి అంబాలా వైపు వెళ్లే రైలును లక్ష్యంగా చేసుకుంటామని మెయిల్‌లో ఆగంతకులు పేర్కొన్నారు. పంజాబీ భాషను ఇంగ్లీష్‌లో రాసి ఢిల్లీ హైకోర్టు, హైకోర్టు రిజిస్ట్రార్, హైకోర్ట్ బార్‌కు ఆగంతకులు మెయిల్ పంపారు. దీంతో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.మరోవైపు శనివారం ఎర్రకోటలో జరిగే 80వ స్వాతంత్ర్య వేడుకలకు ఢిల్లీ పోలీసులు బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతినుద్దేశించి ప్రసంగించనున్న నేపథ్యంలో ఎర్రకోట పరిసరాలను జల్లెడ పడుతున్నారు. ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో భాగంగా భద్రతా ఏజెన్సీలు ముందుగానే సమన్వయంతో మాక్ డ్రిల్స్ కూడా నిర్వహించాయి. ఎర్రకోట లోపల, బయట ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వీడియో అనలిటిక్స్‌తో కూడిన వెయ్యికి పైగా సీసీటీవీ కెమెరాలను అమర్చారు. కంట్రోల్ రూమ్ ద్వారా అనుమానాస్పద కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రత్యేక రెస్పాన్స్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఎర్రకోటతో పాటు ఢిల్లీలోని ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర సున్నిత ప్రాంతాల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశారు. వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్, తనిఖీల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతి ప్రదేశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.అయితే, స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు ఢిల్లీలో బాంబు బెదిరింపు రావడం ఇదే మొదటిసారి కాదు. అంతకుముందు, ఆగస్టు 3న, ఢిల్లీ మేయర్ కార్యాలయానికి బాంబు బెదిరింపు ఈమెయిల్ రాగా, ఢిల్లీలోని పలు పాఠశాలలకు, ఢిల్లీ హైకోర్టుకు కూడా ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. జులైలో, ఎర్రకోటకు సంబంధించి కూడా ఒక బాంబు బెదిరింపు వచ్చినట్లు నివేదికలు పేర్కొన్నాయి. కానీ విచారణలో అవన్నీ నకిలీవని తేలింది.

# సైన్యం కన్నా రైల్వేలపైనే ఐఎస్ఐ కన్ను!

**మొదటిపేజీ తరువాయి -** దేశానికి జీవనాడి అయిన భారతీయ రైల్వే వ్యవస్థపై పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ (ఐఎస్ఐ) భారీ కుట్రకు తెరలేపినట్లు భారత నిఘా వర్గాలు సంచలన విషయాలు వెల్లడించాయి. రైల్వేలు ఇటీవల కాలంలో ఉగ్రవాదుల ప్రధాన లక్ష్యంగా మారాయని, దేశవ్యాప్తంగా భయాందోళనలు సృష్టించేందుకు ఐఎస్ఐ ఒక పక్కా వ్యూహంతో ముందుకెళుతోందని ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) తన నివేదికలో హెచ్చరించింది. స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో ఈ హెచ్చరికలు తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకు న్నాయి.ఐబీ అధికారుల ప్రకారం.. ఐఎస్ఐ తన గూఢచర్య కార్యకలాపాలను ప్రధానంగా భారత సైన్యం, రైల్వేలపైనే కేంద్రీకరించింది. అయితే, ఇటీవలి కాలంలో ఈ వ్యూహంలో స్పష్టమైన మార్పు కనబడుతోంది. సైనిక స్థావరాలపై సమాచారం సేకరణ దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా ఉండగా, రైల్వేలపై మాత్రం తక్షణ దాడులు చేయాలనే ఉద్దేశంతో సమాచారాన్ని సేకరిస్తున్నారు. దేశ రవాణా వ్యవస్థకు రైల్వేలు వెన్నెముక అని, వాటిని దెబ్బతీస్తే ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించవచ్చని ఐఎస్ఐ భావిస్తోంది.ఈ కుట్రలో భాగంగా ఐఎస్ఐ రెండు రకాల వ్యూహాలను అమలు చేస్తోంది. ఒకటి, రైల్వే స్టేషన్లు, ట్రాక్‌లపై నేరుగా దాడులు చేయడం. రెండోది, ప్రజలను మానసికంగా దెబ్బతీసేందుకు 'మైండ్ గేమ్స్' ఆడటం. ఇందుకోసం ప్రత్యేకంగా కొందరిని నియమించుకుని, రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో బాంబు బెదిరింపుల వంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయిస్తున్నారు. ఇలాంటి పుకార్లతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగి, ఎలాంటి దాడి లేకుండానే భారీ ప్రాణనష్టం కలిగించవచ్చని అధికారులు విశ్లేషిస్తున్నారు.ఈ కుట్ర కోసం గత ఏడాది కాలంగా ఐఎస్ఐ నిఘాను పది రెట్లు పెంచింది. కేవలం రూ.3,000 వంటి స్వల్ప మొత్తానికే కొందరు యువకులను ఏజెంట్లుగా నియమించుకుని, వారి ద్వారా రైల్వే స్టేషన్లలోని కీలక ప్రదేశాలను ఫొటోలు తీయించడం, భద్రతా ఏర్పాట్లను అంచనా వేయించడం వంటివి చేస్తోంది.మరింత పక్కాగా సమాచారం కోసం కొన్ని రైల్వే స్టేషన్లలో సోలార్ పవర్ ఆధారిత సీసీటీవీ కెమెరాలను కూడా రహస్యంగా ఏర్పాటు చేయించినట్లు దర్యాప్తులో తేలింది. ఒక్కో కెమెరా అమర్చినందుకు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు చెల్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడులకు ఇస్లామిస్ట్ గ్రూపులతో పాటు పంజాబ్, హర్యానాల్లో రైల్వేలను లక్ష్యం చేసుకునేందుకు 'బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్' (బీకేఐ) వంటి సంస్థలను కూడా ఐఎస్ఐ వాడుకుంటోందని తెలిసింది.ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో భద్రతా బలగాలు ఢిల్లీపై ఎక్కువగా దృష్టి సారిస్తాయని, ఇదే అదనుగా రైల్వే వ్యవస్థపై దాడికి ఉగ్రమూకలు ప్రయత్నించవచ్చని ఐబీ హెచ్చరించింది. దీంతో ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్లలో హై అలర్ట్ ప్రకటించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

## 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలు



**మొదటిపేజీ తరువాయి -** వేసింది. రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డులో శుక్రవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.40 కోట్ల విలువైన 58 అధునాతన అగ్నిమాపక వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు మరింత వేగంగా, సమర్థవంతంగా స్పందించడమే లక్ష్యంగా ఈ ఆధునికీకరణ చేపట్టారు.కొత్తగా సమకూర్చిన ఈ వాహనాల్లో గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో సేవలు అందించేందుకు 25 అధునాతన ఫైర్ ఫైటింగ్ వాహనాలు, భారీ ప్రమాదాల సమయంలో నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేందుకు 14,000 లీటర్ల సామర్థ్యం గల 20 వాటర్ బౌజర్లు ఉన్నాయి. వీటితో పాటు ఇరుకైన, రద్దీ ప్రదేశాల్లోకి వేగంగా చేరుకునేందుకు 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ వాహనాలను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ వాహనాలను 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేశారు.అగ్నిమాపక శాఖను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం మొత్తం మూడు దశల్లో రూ.252.86 కోట్లతో ప్రణాళికను అమలు చేస్తోంది. తొలి దశలో భాగంగా ఇప్పటికే రూ.33 కోట్లతో 65 వాహనాలను అందుబాటులోకి తీసుకురాగా, తాజా ప్రారంభోత్సవం రెండో దశకు చెందింది. మూడో దశలో మరిన్ని వాహనాలతో పాటు అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయనున్నారు. వాహనాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 17 కొత్త ఫైర్ స్టేషన్ల నిర్మాణం, 36 పాత స్టేషన్ల ఆధునికీకరణ పనులు కూడా జరుగుతున్నాయి.ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు వాహనాల పనితీరు, ప్రత్యేకతలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రమాదాలకు త్వరితగతిన స్పందించి, ప్రాణ, ఆస్తినష్టాన్ని నివారించడమే లక్ష్యంగా ఈ ఆధునికీకరణ చేపట్టినట్లు వారు తెలిపారు.

## బంగ్లాదేశ్‌కు భారత రైల్వే కోచ్‌లు

**మొదటిపేజీ తరువాయి -** ద్వారా బంగ్లాదేశ్‌కు పంపినట్లు అక్కడి స్థానిక మీడియా శుక్రవారం వెల్లడించింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేదిగా నిలుస్తోంది.ఈ కోచ్‌లను పంజాబ్‌లోని కపుర్తలా రైల్ కోచ్ ఫ్యాక్టరీ (=జఖీ)లో తయారు చేశారు. బంగ్లాదేశ్ రైల్వే వ్యవస్థను ఆధునీకీకరించే లక్ష్యంతో 200 కొత్త ప్యాసింజర్ కోచ్‌లను కొనుగోలు చేసే ప్రాజెక్టులో భాగంగా ఈ సరఫరా జరిగింది. బంగ్లాదేశ్‌లోని 'డైలీ సన్' పత్రిక కథనం ప్రకారం, ఈ కొత్త కోచ్‌ల రాకతో నైరుతి ప్రాంతంలో, ముఖ్యంగా పద్మ రైలు వంతెన మీదుగా నడిచే రైల్వే సేవలు మరింత సమర్థవంతంగా, నమ్మకంగా మారనున్నాయి.మొత్తం 200 బ్రాడ్-గేజ్ కోచ్‌ల కొనుగోలు కోసం బంగ్లాదేశ్ 2022లో ఒక ప్రాజెక్టును ప్రారంభించింది. దీని అంచనా వ్యయం 1,704.66 కోట్ల బంగ్లాదేశ్ టాకాలు కాగా, ఇందులో దాదాపు 1,331 కోట్ల టాకాలను యూరోపియన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (జు×దీ) రుణంగా సమకూరుస్తోంది. ఈ మేరకు బంగ్లాదేశ్ రైల్వే, భారత ప్రభుత్వ రంగ సంస్థ రైట్స్ లిమిటెడ్ (=ఘజుూ) మధ్య ఈ ఏడాది మే నెలలో ఢాకాలో ఒప్పందం కుదిరింది.ఈ ఒప్పందం ప్రకారం, రైట్స్ సంస్థ కేవలం కోచ్‌లను సరఫరా చేయడమే కాకుండా, వాటి డిజైన్, విడిభాగాలు, సిబ్బందికి శిక్షణ వంటి సాంకేతిక సహాయాన్ని కూడా అందించాల్సి ఉంటుంది. కోచ్‌ల సరఫరాకు 36 నెలలు, ఆ తర్వాత 24 నెలల వారంటీ వ్యవధి ఉంటుంది. అయితే, 2022 మార్చిలో ప్రాజెక్టుకు ఆమోదం లభించినా, ఒప్పందం కుదరడానికి రెండేళ్లకు పైగా సమయం పట్టింది. తాజాగా ఒప్పందం అమల్లోకి రావడంతో కపుర్తలా ఫ్యాక్టరీలో తయారైన తొలి బ్యాచ్ బంగ్లాదేశ్‌కు చేరింది. ఈ బ్యాచ్‌లో 3 ఏసీ స్లీపర్ కోచ్‌లు, 3 ఏసీ చైర్ కార్లు, 11 నాన్-ఏసీ చైర్ కార్లు, 2 పవర్ కార్లు ఉన్నాయి.చివరిసారిగా 2015-16లో భారత్ 120 కోచ్‌లను బంగ్లాదేశ్‌కు సరఫరా చేసింది. చాలా కాలంగా పాత కోచ్‌లతో ఇబ్బందులు పడుతున్న బంగ్లాదేశ్ రైల్వే, ఈ కొత్త కోచ్‌లతో తమ సేవలను మెరుగుపరచుకోవాలని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు కేబినెట్ నిర్ణయం



**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ రైజింగ్2.0 సమ్మిట్, స్మార్ట్ రేషన్ రేషన్‌కార్డుల పంపిణీ, సన్నవడ్లకు సబ్సిడీ సహా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను వెల్లడించారు.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. డిసెంబర్ 7,8,9 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి అధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. గత ఏడాది తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ ఆవిష్కరించినట్లే ఈసారి ఇన్వెస్ట్ థీమ్‌తో తెలంగాణ సదస్సు నిర్వహణను మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ఆవిష్కరించింది. ప్రధానంగా మన రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందని మంత్రులు వివరించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రంలో రేషన్‌కార్డుదారులకు స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు సంబంధించి అన్ని జిల్లాల్లోనూ ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 2.81 కోట్ల మంది రేషన్ కార్డు లబ్ధిదారులుంటే, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. తెలిపారు. 62 లక్షల మందికి కొత్తగా లబ్ధి చేకూర్చిందన్నారు. రాష్ట్రంలో ఈరోజుకు మొత్తం 3.42కోట్ల మంది రేషన్ లబ్ధిదారులున్నారని చెప్పారు. వీరికి స్మార్ట్ కార్డుల జారీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని మంత్రి పొంగులేటి తెలిపారు.వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, ఆ ఏడు రకాల సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని కేబినేట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని కేబినేట్ తీర్మానించింది.కేంద్రం కొనుగోలు చేయగా మిగతా 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి ఈ వేలం (వ-ూబవ్షిఅశీఅ) ద్వారా ధాన్యం అమ్మాలని మంత్రివర్గం నిర్ణయించింది.రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు తీర్మానించింది.

ప్రజా మంటలు
శనివారం 15 - 08 - 2026

# రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం ఇవ్వాలి

**ఎల్కతుర్తి ఆగస్టు 14 ప్రజా మంటలు :** మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన వారికి.సీఎం. పరకాల పర్యటనలో స్పష్టమైన ప్రకటన చేయాలి హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో రైతు రక్షణ సమితి నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూగత ఏడాది మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన ఉమ్మడి హనుమకొండ డకరీంనగర్ జిల్లా పరిధిలోని రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా మరియు కరీంనగర్ జిల్లా ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు హింగే భాస్కర్ డిమాండ్ చేశారు.తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా పంట నష్టపోయారని, పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. పంట నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించి అండగా నిలవాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరకాలకు వస్తున్న నేపథ్యంలో,



ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల పంట నష్టపరిహారం అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.ప్రత్యేకంగా దృష్టి సారించాలని హింగే భాస్కర్ కోరారు. ఇప్పటికే నిర్వహించిన పంట నష్టం సర్వే వివరాలను సమీక్షించి, అర్హులైన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పంట నష్టం సర్వేలో అర్హులైన రైతుల పేర్లు నమోదు కాకపోతే వారికి మరోసారి అవకాశం కల్పించాలని, ఎలాంటి వివక్ష లేకుండా నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేయాలని అన్నారు. పరిహారం ఎప్పుడు విడుదల చేస్తారనే విషయంపై ముఖ్యమంత్రి పరకాల పర్యటనలో స్పష్టమైన తేదీ ప్రకటించాలని కోరారు."రైతులు ప్రకృతి వైపరీత్యాలతో పంటలు కోల్పోయి తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి, మొంథా తుఫాన్ నష్టపరిహారాన్ని ఇక ఆలస్యం చేయకుండా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి. రైతులకు కేవలం హామీలు కాకుండా తక్షణ ఆర్థిక సహాయం అందించాలి" అని హింగే భాస్కర్ అన్నారు.రైతుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రైతు రక్షణ సమితి నిరంతరం రైతుల పక్షాన నిలబడి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈట్టి కార్యక్రమంలో జిల్లా సలహాదారుడు సుకినే సుధాకర్ రావు. జిల్లా కార్యదర్శి అంబీర్ శ్రీనివాస్. మండల అధ్యక్షుడు కొప్పు తిరుపతి. నాయకులు భాష వేన కుమార్. గూడెల్లి రాములు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రాయదుర్గం భూముల వేలంపై ఎన్‌హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు

**హెరిటేజ్ రాళ్ల విధ్వంసంపై న్యాయవాది రామారావు ఆగ్రహం**

**సికింద్రాబాద్, ఆగస్టు 14 ( ప్రజామంటలు) :** తెలంగాణ పరిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) రాయదుర్గం పాన్‌మక్తా పరిధిలోని భూములను వేలానికి ఉంచడంపై తీవ్ర దుమారం రేగుతోంది. సుమారు 250 ఏళ్ల (బిలియన్ ఏళ్ల) ప్రాచీన చరిత్ర కలిగిన హెరిటేజ్ రాతి నిర్మాణాలను (హెరిటేజ్ రాక్ ఫార్మేషన్స్) కాపాడాల్సింది పోయి, అధికారులు వేలం నోటీసులు జారీ చేయడంపై మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ)ను ఆశ్రయించారు. ఈ వేలం ప్రక్రియపై ఆయన దాఖలు చేసిన ఫిర్యాదును ఎన్‌హెచ్ఆర్‌సీ నమోదు చేసింది (ఫిర్యాదు సంఖ్య: 18989//2026). ఈ వ్యవహారంలో హెరిటేజ్ నిబంధనల ఉల్లంఘనపై టీజీఐఐసీతో పాటు సంబంధిత అధికారుల తీరును తప్పుపడుతూ, ఐఏఎస్ అధికారి సర్ఫరాజ్ అహ్మద్ నుంచి నివేదిక కోరాలని రామారావు కమిషన్‌ను అభ్యర్థించారు.రాయదుర్గంలోని 26 ఎకరాల అత్యంత విలువైన భూమిలో ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న రాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, అధికారుల కంటికి మాత్రం అవి వేలం భూములుగానే కనిపించడం దారుణమని రామారావు ఇమ్మనేని తన ఫిర్యాదులో ధ్వజమెత్తారు. తెలంగాణ హెరిటేజ్ చట్టం, రెగ్యులేషన్ 13 నిబంధనలు చట్ట పుస్తకాలకే పరిమితమయ్యాయా లేదా వేలం వేసే మైదానాలకు కూడా వర్తిస్తాయా అని ఆయన నిలదీశారు. కనీసం హెరిటేజ్ కమిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా టీజీఐఐసీ అధికారులు వేలం వేయడానికి ఎందుకు అంత తొందరపడుతున్నారని ప్రశ్నించారు.ఈ నెల 17, 20 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన ఈ వేలం ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఆయన ఎన్‌హెచ్ఆర్‌సీని కోరారు. ముందే వేలం హక్కులను సృష్టించి, ఆ తర్వాత చట్టబద్ధత కోసం వెతకడం ఏంటని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలంలో విజేతలైన వారికి భూమి దక్కుతుందని, కానీ చారిత్రక సంపదను కోల్పోయిన ప్రజలకు మిగిలేది ఓటమి మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాళ్లను



నాశనం చేసిన తర్వాత అధికారులు ఫైళ్లలో సంరక్షణ చర్యలు రాసుకుంటే ఉపయోగం ఉండదని, చారిత్రక హెరిటేజ్ సంపదను రక్షించాల్సిన ప్రభుత్వమే వేలం వేస్తే ఇక ప్రజలకు మిగిలేది ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ఆర్‌సీ తక్షణమే జోక్యం చేసుకుని రాయదుర్గం హెరిటేజ్ భూముల వేలాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

## బిజెపి దళిత వ్యతిరేకి కాంగ్రెస్ నేతల ఆగ్రహం

**బన్సీలాల్‌పేటలో భారీ సత్యాగ్రహ దీక్ష**




**సికింద్రాబాద్, ఆగస్టు 14 ( ప్రజామంటలు) :** ఉత్తరాఖండ్‌లో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ ముగిసిన అనంతరం ఆ ప్రాంగణాన్ని 'శుద్ధి' చేయడంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భాజపా దళిత వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షులు దీపక్ జాన్ ఆధ్వర్యంలో శుక్రవారం బన్సీలాల్‌పేట జబ్బర్ కాంప్లెక్స్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు భారీ సత్యాగ్రహ దీక్ష చేపట్టాయి. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, పిసిసి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కోట నీలిమ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. దీక్షలో భాగంగా 10 నిమిషాల పాటు మౌనం పాటించి, అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం బైబిల్ హౌస్ వరకు భారీ పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లవుతున్నా బిజెపి మనస్తత్వంలో అంటరానితనం, దళిత వ్యతిరేక భావజాలం కొనసాగడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యసభ ప్రతిపక్ష నేతగా ఉన్న ఖర్గే పట్ల బిజెపి శ్రేణులు ప్రవర్తిస్తున్న తీరును, పార్లమెంట్ లోపలా బయటా బిజెపి నేతల వైఖరిని ఎండగట్టారు. బిజెపి హయాంలో దళితులపై అరాచకాలు, వివక్ష పెరిగిపోయాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు చేపట్టిన ఈ ఆందోళన కేవలం ప్రారంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో బిజెపి దళిత వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సత్యాగ్రహ దీక్షలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఋతుక్రమ శుభ్రత నిర్వహణ" గదిని ప్రారంభించిన

**మండల విద్యాధికారి కొండ కనకతార**

**మెట్టుపల్లి ఆగస్టు 14 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** మెట్టుపల్లి పరిధిలోని వెల్లుల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శుక్రవారం రోజు బాలికల కోసం "ఋతుక్రమ శుభ్రత నిర్వహణ" కార్నర్ మరియు "ఇన్సినరేటర్ "ను మండల విద్యాధికారి కొండ కనకతార, మండల వైద్యాధికారి అజిత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి,ఉప సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి,ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల కమిటీ





చైర్మన్ పోచంపల్లి లక్ష్మి లు ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యాధికారి మాట్లాడుతూ పాఠశాల లో చదివే బాలికలు నెలసరి పీరియడ్స్ వచ్చినప్పుడు పాఠశాలకు కొద్ది రోజులు గైర్హాజర్ అవుతున్నారని , దీన్ని అరికట్టడానికి "శానిటరీ నాప్కిన్స్" పాఠశాలలోనే అందిస్తూ గర్ల్ ఫ్రెండ్లీ టీచర్ ఆధ్వర్యంలో "మెన్స్ట్రువల్ హైజిన్ మేనేజ్మెంట్(వీఎవీ) కార్నర్ "ను ఏర్పాటు చేయడం బాలికలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.వైద్యాధికారి అజిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యాసంస్థలో ఇటువంటి కార్నర్ లు ఎంతో అవసరమని, బాలికల విషయంలో ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి చూపిన చొరవ అభినందనీయమని తెలిపారు.గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం హై స్కూల్ లలో 50 కి పైగా బాలికలు చదువుచున్న ప్రతి హైస్కూల్ కి "వాడిన శానిటరీ పాడ్స్" ను కాల్చివేసే ఇన్సినరేటర్ ను అందివ్వడం చాలా సంతోషం అని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆయుర్వేదిక్ వైద్యులు శ్రీవాణి,గ్రామ పాలనాధికారులు నాగరాణి, రాజేశం, ఏ ఎన్ ఎమ్ సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.వా

# పోలీసు ఉద్యోగార్థులకు శుభవార్త గరిష్ఠ వయోపరిమితి మరో రెండేళ్లు పెంపు

**యూనిఫామ్ సర్వీసెస్ ఉద్యోగాలపై ప్రభుత్వం కీలక నిర్ణయంల**

**డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి రెండేళ్లు పెంపు**

**మొత్తం ఏడేళ్ల వరకు వయోపరిమితి పెంచుతూ ఉత్తర్వులు**

పోలీసు ఉద్యోగార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి రెండేళ్లు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఐదేళ్ల వయోపరిమితిని పెంచినా యువత నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. వివరాల్లోకి వెళితే,యువత విజ్ఞప్తితో నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం పోలీసు ఉద్యోగార్థులకు శుభవార్త చెప్పింది. యూనిఫామ్ సర్వీసెస్ ఉద్యోగాలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి రెండేళ్లు పెంచింది. పోలీస్, ఫైర్, జైళ్లు, ఎస్‌పీఎఫ్, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్, ఫారెస్ట్ శాఖల పోస్టులకు వయోపరిమితి పెంచింది. ఇప్పటికే 2026 మే 18 నుంచి అమల్లో ఉన్న ఐదేళ్ల వయోపరిమితి పెంచారు. తాజాగా ఐదేళ్లకు అదనంగా మరో రెండేళ్లు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మొత్తం ఏడేళ్ల వరకు వయోపరిమితి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పోలీస్ రిక్రూట్‌మెంట్లకు ఈ వయోపరిమితి వర్తిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. నిరుద్యోగ యువత నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో కొలువుల సందడి తెలంగాణ పోలీస్ శాఖలో కొలువుల సందడి మొదలైంది. 7,437 పోస్టుల భర్తీ కోసం తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) ఇటీవల నోటిఫికేషన్లు జారీ చేసింది. పోలీస్, అగ్నిమాపక, జైళ్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) శాఖలకు సంబంధించి వేర్వేరుగా 4 ప్రకటనలు వెలువడ్డాయి. వీటిలో ఎస్సై, ఏఎస్సై, కానిస్టేబుల్ పోస్టులు మొత్తంగా 7 వేలకు పైగా ఉన్నాయి. పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులు మండలి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లికేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు పీఎంటీ, పీఈటీ ప్రమాణాలు సరిగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే అప్లై




చేసుకోవడం ఉత్తమం.ఆరోజు నుంచి అప్లై చేసుకోండి ఆగస్టు 19వ తేదీ ఉదయం 8 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని నియామక మండలి తెలిపింది. సెప్టెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పింది. దరఖాస్తులను అధికారిక వెబ్ సైట్ ద్వారా మాత్రమే స్వీకరిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఎస్సై పోస్టులకు ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు రూ.750 కాగా ఇతరులు రూ.1,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. ఈ ధ్రువీకరణ పత్రాలు మీవద్ద ఉన్నాయా ఆన్‌లైన్‌లో అప్లికేషన్ చేసే ముందే తెలంగాణలో స్థానికులైన అభ్యర్థులు కొన్ని సర్టిఫికెట్లను సమకూర్చుకోవాలని నియామక మండలి సూచించింది.బీసీ అభ్యర్థులు ఈ సంవత్సరం ఏప్రిల్ 1 తర్వాత తీసుకున్న నాన్-క్రీమీలేయర్ ధ్రువపత్రం సిద్ధం చేసుకోవాలి.అభ్యర్థులంతా 1 నుంచి 7 తరగతుల వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు లేదంటే రెసిడెన్సియల్ సర్టిఫికెట్ (రెండింటిలో ఏవి వర్తిస్తే అవి) రెడీగా ఉంచుకోవాలి.స్పోర్ట్స్, దివ్యాంగ తదితర ప్రత్యేక కేటగిరీల కింద అర్హులైతే వాటికి సంబంధించిన ధ్రువపత్రాలు దగ్గర పెట్టుకోవాలి.ఎస్సీ అభ్యర్థులు ఎస్సీ గ్రూప్-1, 2, 3 ఉపవర్గీకరణతో కూడిన తాజా కుల ధ్రువపత్రం పొంది ఉండాలి.ఎస్టీ అభ్యర్థులు క్యాస్ట్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి.ఆర్థికంగా బలహీనవర్గాల (ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులు ఈ ఏడాది ఏప్రిల్ 1 తర్వాత ప్రభుత్వం నుంచి పొందిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ను సిద్ధం చేసుకోవాలి.

## ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి మహర్దశ విమానాశ్రయం,

**రైల్వేలైన్, పారిశ్రామిక కారిడార్‌తో సరికొత్త రూపు . ఆదిలాబాద్ అభివృద్ధి దిశగా చకచకా అడుగులు . పారిశ్రామిక కారిడార్, విమానాశ్రయంతో వందలాది మందికి ఉపాధి**

ఎయిర్‌పోర్టు మయాజూరు, మెగా పారిశ్రామిక కారిడార్, మరోవైపు ఆర్మూర్ రైల్వేలైన్‌కు వేగంగా అడుగులు పడుతున్నాయి. మొత్తంగా ఆదిలాబాద్ జిల్లాకు మహర్దశ పట్టనుందని తెలుస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరాలు కురిపిస్తుండటంతో అనుకున్నవన్నీ పూర్తయినట్లయితే స్థానికంగా ఉన్న వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. వివిధ పరిశ్రమల అనుబంధ విభాగాలు రానుండటంతో ఆదిలాబాద్ సమగ్ర అభివృద్ధికి అడుగులు పడనున్నాయి.విమానాశ్రయ కల నెరబోతోంది ఆదిలాబాద్‌లో రక్షణ శాఖకు చెందిన 369 ఎకరాల విశాలమైన స్థలం ఉన్నప్పటికీ విమానం ఎక్కే భాగ్యం కోసం ఎంతోమంది స్థానికులు ఎదురుచూస్తుండగా తాజాగా ఆ కల నెరవేరబోనుంది. ఐఏఎఫ్, ఏఏఐలు(ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా) సంయుక్తంగా ఏర్పాటుచేసే విమానాశ్రయం కోసం భూసేకరణ, ఇతర వ్యయాలకు సంబంధించి నిధులు మంజూరు చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో యుద్ధప్రాతిపదికన సర్వే జరుగుతోంది. విమానాశ్రయం ఏర్పాటు, పారిశ్రామికవేత్తల రాకతో స్థానికంగా పెట్టుబడులకు మరింత ఊతమివ్వనుంది. సరుకు రవాణాకు సంబంధించి కార్గో సౌకర్యంతో కొత్త కంపెనీల గోదాంల నిర్మాణం, స్టార్ హోటళ్లు, ఇతర వ్యాపారాలతోనూ స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు - రూ. 2278.14 కోట్లు భూసేకరణ - 2009.23 ఎకరాలు మెగా పారిశ్రామిక పార్క్‌తో బహుళ ప్రయోజనాలు : భోరజ్ మండలంలో ఏర్పాటవ్వబోయే మెగా పారిశ్రామిక పార్క్‌తో జిల్లా వాసులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి. వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు భారీ పరిశ్రమలు తీసుకురానున్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో భూసేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇప్పటికే ఎంపిక చేసిన భూమి వివరాలను ప్రకటించారు.



రాయితీలతో కేటాయింపు ఈ స్థలాలతో స్థానికులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం ఏర్పడుతుంది. కంపెనీల్లో ఉద్యోగాల కల్పన, ఇతర రీతిలో వేలాదిమంది నిరుద్యోగులకు ఇది ఉపాధి కల్పించనుంది.ఇండస్ట్రియల్ కారిడార్ లక్ష్యం - 10 వేల ఎకరాలు ప్రస్తుతం ఎంపికచేసింది - 2062 ఎకరాలు అదనంగా గుర్తించింది - 1300 ఎకరాలు కల సాకారం దిశగా అడుగులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్ నగరానికి నేరుగా రైలు నడపాలని జిల్లా వాసుల చిరకాల వాంఛ. ప్రస్తుతం మహారాష్ట్ర మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తుండటంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆర్మూర్ వరకు లైన్ నిర్మించినట్లయితే అక్కడి నుంచి సికింద్రాబాద్‌కు చేరుకోవచ్చు. ఆర్మూర్ లైన్ కోసం సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమవడంతో భరోసా ఏర్పడింది. ఇటీవల జిల్లా ప్రజాప్రతినిధులతో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చర్చించడం ప్రాజెక్టు వేగం మరింత పుంజుకోనుందనే ఆశలు రేకెత్తిస్తున్నాయి.రైల్వేలైన్ పొడవు - 135.50 కిలోమీటర్లు నిర్మాణ అంచనా వ్యయం - రూ. 4398.03 కోట్లు.

## ధర్మపురి గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు



**వెల్గటూర్ ఆగస్టు 14 (ప్రజా మంటలు) :** ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని గోదావరి నదిలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు.తెలంగాణతో పాటు మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు ధర్మపురికి తరలివచ్చి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. అనంతరం తీరంలోని సంతోషిమాత, గోదావరి మాత ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.ధర్మపురి నుండి 8 కిలోమీటర్ల దూరం లో ఉన్న రాయపట్నం పుష్కర ఘాట్ల పైన కూడా పెద్ద ఎత్తున భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు.ఽ

## జగన్నాథపూర్ లో ప్రకృతి వ్యవసాయం పై సదస్సు

**ఎల్కతుర్తి ఆగస్టు 14 ప్రజా మంటలు :** మండల కేంద్రంలోని జగన్నాథ్ పూర్ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ఏ ఈ ఓ అనురిక అగ్నిహాస్త్రం తయారు చేసి చూపించడం జరిగింది.శుక్రవారం గ్రామంలో.రైతులకు అగ్ని హాస్త్రం తయారీకి అవసరమైన పదార్థాలు, తయారీ విధానం మరియు పంటల్లో దాని ఉపయోగం గురించి తెలిపారు . మెథడ్ డెమాన్స్ట్రేషన్ అనంతరం తయారు చేసిన అగ్ని హాస్త్రం 20 మంది ప్రకృతి వ్యవసాయ రైతులకు పంపిణీ చేయడం జరిగింది. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను మరింతగా అవలంబించాలని సూచించారు . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదగిరి గారు బీసీఐ ప్రతినిధులు రఘు గారు, లత , రజిత, సి ఆర్ పి ఐలయ్య,మరియు గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.




## పాఠశాల విద్యార్థినులను ఏడిపిస్తున్న గంజాయి ముఠా

**గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆందోళనకరం**




**సికింద్రాబాద్, ఆగస్టు 14 ( ప్రజామంటలు) :** గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బన్సీలాల్‌పేట్ డివిజన్, న్యూ బోలక్‌పూర్ మేకల మండి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు గంజాయి వ్యసనపరుల నుంచి తీవ్ర వేధింపులు ఎదురవుతున్నాయి. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కొందరు గంజాయి అలవాటు ఉన్న వ్యక్తులు బడి ముందు నిలబడి వేధిస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప వెల్లడించారు. అంతేకాకుండా, రెండు రోజుల క్రితం సదరు వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి అక్రమంగా ప్రవేశించి బాత్రూంల వైపు వెళ్లారని ఆమె తెలిపారు.గంజాయి ముఠా ఆగడాల వల్ల బడికి వచ్చే బాలికలతో పాటు ఉపాధ్యాయినులు కూడా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని పాఠశాల హెచ్ఎం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయంపై తక్షణమే స్పందించి ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గంజాయి వ్యసనపరుల బారి నుంచి పాఠశాల విద్యార్థులను, సిబ్బందిని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ప్రజా మంటలు, ఆగస్ట్ 14 :** జగిత్యాల రూరల్ మండలం వంజరు పల్లి గ్రామంలో 20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని .జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య, సర్పంచ్ అదరవేని గంగమల్లయ్య, ఉపసర్పంచ్ బొల్లె తిరుపతి భీమవ్వ, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, ఎంపీడీవో రమాదేవి, తహసీల్దార్ హాకీం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, మాజీ పాక్స్ చైర్మెన్ సదాశివ రావు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి, సర్పంచుల ఫోరం కట్ట రాజేందర్, మాజీ ఎంపీపీ మహేష్,, సర్పంచ్ లు ప్రకాశ్, వంశీ, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, కుడుకుల లక్ష్మణ్, అంకం సతీష్, నరేష్, గంగారం, డిసిసి ఉపాధ్యక్షులు డీలర్ రవి, నరేష్ , మండల యూత్ అధ్యక్షులు భూమరెడ్డి, నాయకులు తిరుపతి, ఎఎంసి డైరెక్టర్ శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ శంకర్ , అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# పెన్షన్ దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు త్వరితగతిన జారీ చేయాలి



**మెట్‌పల్లి ఆగస్ట్ 14 )ప్రజా మంటలు) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న అర్హులైన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతూ మెట్‌పల్లి పట్టణ బీఆర్ఎస్ నాయకులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు తహశీల్దార్‌ను కలిసి, పెన్షన్ దరఖాస్తులకు అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన జారీ చేయాలని కోరారు.ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం కారణంగా వృద్ధులు, పేదలు, ఇతర అర్హులైన లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన దరఖాస్తుదారుల దరఖాస్తులను త్వరగా పరిశీలించి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వీలైనంత త్వరగా అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పెన్షన్ దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సహకరించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. కార్యక్రమంలో మెట్‌పల్లి పట్టణ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధులకు బీడీ కార్మికులకు పెన్షన్ అందజేయాలని తాసిల్దార్ ఎంపీడీవో కు వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు అవారి చందు

**గొల్లపల్లి అగస్ట్ 14 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ యూత్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పెన్షన్లు చేయాలని తాసిల్దార్ ఎంపీడీఓ లకు వేరువేరుగా వినతి పత్రం అందజేశారు బిఆర్ఎస్ యూత్ నాయకుడు అవారి చందు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీల్లో ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల ఆరు నెలలు పూర్తయినప్పటికీ ఒక్కహామీ కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయింది అని అన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పెన్షన్లలో తెలంగాణ ఆడబిడ్డల జీవనాధారం అయినటువంటి బీడీల పెన్షన్ లేకపోవడం బాధాకరం అన్నారు. అలాగే వృద్ధాప్య పెన్షన్ లేకపోవడం వయసు పైబడిన వృద్ధులకు ఇబ్బంది అవుతుందన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బీడీల కార్మికులకు,వృద్ధాప్య పెన్షన్లు అర్హులకు అందేలా చొరవ తీసుకోవాలని అన్నారు.అలాగే తెలంగాణ మహిళా సమాజానికి ఇస్తా అన్నటువంటి మహాలక్ష్మి పథకం కింద 2500 కూడా అర్హుల నుండి దరఖాస్తు తీసుకొని పథకం అమలు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కసాని గంగాధర్,దొంగల రాజు, కోమల్ల జలంధర్, ఆవుల సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ఖైదీల జీవితాల్లో విద్యాకాంతులు నింపుతున్న తెలంగాణ జైళ్లు ఒకేసారి 78 మంది టెన్త్ పాస్

**సంస్కరణా కేంద్రాలుగా మారుతున్న తెలంగాణ జైళ్లు**

**రాష్ట్ర చరిత్రలో ఒకేసారి 78 మంది ఖైదీలు ఎస్?ఎస్సీ పాస్**

**56 మంది చర్లపల్లి నుంచే ఓపెన్ డిగ్రీ, ఐటీఐ కోర్సులూ**

**అందుబాటులోకి .తెలంగాణ జైళ్లలో పది పాసైన ఖైదీలు**




జైలు అనగానే శిక్షలు, చీకటి గదులు మాత్రమే గుర్తొస్తాయి. కానీ తెలంగాణ జైళ్లు ఇప్పుడు సంస్కరణా కేంద్రాలుగా మారి ఖైదీల జీవితాల్లో విద్యాకాంతులు నింపుతున్నాయి. జైళ్ల చరిత్రలో తొలిసారిగా 78 మంది ఖైదీలు టెన్త్ పాసై సరికొత్త రికార్డు సృష్టించారు. 35 ఏళ్ల తర్వాత 50 సంవత్సరాలున్న ఓ జీవిత ఖైదీ పదో తరగతి పాసై న్యాయవాది కావాలని కలలు కంటుంటే, మరో ఖైదీ ఉన్నత చదువులు చదువుతానంటూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. ఖైదీల పట్టుదలకు మెచ్చిన జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా వారికి ప్రత్యేక రిమిషన్ ప్రకటించారు.మాక్ టెస్టుల నిర్వహణ నేరాలకు పాల్పడి జైలు పాలైన వారు శిక్షాకాలం పూర్తయ్యేలోపు సత్ప్రవర్తన కలిగిన పౌరులుగా మారాలన్నది తెలంగాణ జైళ్ల శాఖ లక్ష్యం. ఇందులో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్)తో ఒప్పందం చేసుకుని ఖైదీలకు చదువుకునే అవకాశం కల్పించారు. చర్లపల్లి, నిజామాబాద్, హైదరాబాద్ మహిళా జైళ్ల నుంచి మొత్తం 108 మంది ఖైదీలు ఎస్సెస్సీ పరీక్షలకు నమోదు చేసుకోగా, ఏకంగా 78 మంది ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. ఇందులో చర్లపల్లి జైలు నుంచే అత్యధికంగా 56 మంది పాస్ అయ్యారు. జైళ్ల శాఖ ప్రత్యేకంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులను నియమించి, మాక్ టెస్టులు, ప్రీ-బోర్డ్ పరీక్షలు పెట్టి మరీ వీరిని సన్నద్ధం చేయడం విశేషం. రిమిషన్ కింద ప్రోత్సాహకాలు : చదువు కోసం ఖైదీలు చూపిన క్రమశిక్షణ, అంకితభావం చూసి తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ డాక్టర్ సౌమ్య మిశ్రా హర్షం వ్యక్తం చేశారు. పాసైన 78 మంది ఖైదీలకు ఆమె స్వయంగా సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించి సాధించిన ఈ విజయం వారి స్వీయాభివృద్ధిలో కీలక మైలురాయి అని ఆమె కొనియాడారు. విద్యపై ఖైదీలు చూపిన ఆసక్తికి బహుమతిగా ఉత్తీర్ణులైన వారందరికీ డైరెక్టర్ జనరల్ రిమిషన్ కింద ప్రత్యేక ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. ఇది పునరావాసం దిశగా అడుగులేస్తున్న మిగతా ఖైదీలకు కూడా ఎంతో ప్రేరణగా నిలుస్తుందని డీజీ ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ జైళ్లలో పదో తరగతి పాసైన ఖైదీలు ."సెంట్రల్ ప్రిజన్ చర్లపల్లిలో ఐటీఐ ద్వారా పలు కోర్సుల్లో శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి యూజీ, పీజీ కోర్సులు కూడా చేయడానికి అవకాశం ఉంది. చదువు, నైపుణ్యాలతో గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు ఆశ్రమవాసులను మరింత ప్రోత్సహిస్తాం " - డాక్టర్ సౌమ్య మిశ్రా, తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్.35 ఏళ్ల తర్వాత పది పాస్ చదువుకోవాలన్న తపన ఉండాలే కానీ వయసు, పరిస్థితులు ఏవీ అడ్డుకావని నిరూపిస్తున్నాడు చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న ఓ జీవిత ఖైదీ. ఆరో తరగతితోనే బడి మానేసిన అతడు తోటి ఖైదీలు డిగ్రీలు, పీజీలు చదువుతుంటే చూసి స్ఫూర్తి పొందాడు. పదో తరగతి పాస్ కావాలన్న తన తండ్రి కోరికను 35 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఇప్పుడు ఏకంగా 50 ఏళ్ల వయసులో నిజం చేసి చూపించాడు. భవిష్యత్తులో ఎల్.ఎల్.బి పూర్తి చేసి తోటి పేద ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు అందించాలన్నదే తన లక్ష్యమని చెబుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు."నేను కొన్ని అనివార్య కారణాల వల్ల ఐదో తరగతి వరకు చదివి, ఆరు నుంచి బడి మానేశాను. ఇప్పుడు పదో తరగతి పాసయ్యానని చెప్పుకోవడానికి గర్వంగా ఉంది. 35 ఏళ్ల తర్వాత 81 శాతంతో పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్‌లో జాయిన్ అయ్యాను. నా చదువును ఇంతటితో ఆపను. ఎల్ఎల్‌బీ చదివి అందరికీ న్యాయసేవలు అందిస్తాను" ఓ ఖైదీ. ఉపాధి పొందేలా చర్యలు : ఇక టెన్త్ పాసైన ఈ ఖైదీల విద్యా ప్రయాణం ఇక్కడితో ఆగిపోకుండా ఎన్ఐఓఎస్ ద్వారా వీరు సీనియర్ సెకండరీ, ఆ తర్వాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదివేలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. భవిష్యత్తులో వీరికి ఉపాధి సులభంగా లభించేలా పాఠ్యాంశాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ నైపుణ్యాలను సైతం చేర్చారు. త్వరలోనే ఐటీఐ కోర్సు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని డీజీ సౌమ్య మిశ్రా తెలిపారు.జైలుకు వచ్చిన ఖైదీ బయటకు వెళ్లేలోపు విజ్ఞానవంతుడిగా మారి సమాజంలో మంచి జీవితాన్ని గడపాలన్నదే తమ లక్ష్యమని డీజీ సౌమ్య మిశ్రా తెలిపారు. ఈ మార్పులతో ఒకప్పుడు శిక్షా కేంద్రాలుగా ఉన్న జైళ్లు నేడు కరెక్షనల్ సర్వీసెస్‌గా మారి ఖైదీలు స్వయం ఆధారిత జీవితం గడిపేలా మార్గనిర్దేశం చేస్తున్నాయి.ం

# నల్సార్ విద్యార్థులపై ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకున్న బీసీఐ

**నల్సార్ విద్యార్థుల అంశంలో వెనక్కి తగ్గిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా**

**విద్యార్థులపై ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకున్న బీసీఐ**

**నల్సార్ విద్యార్థులు ఎక్కడైనా న్యాయవాదులుగా నమోదు చేసుకోవచ్చన్న బీసీఐ**




నల్సార్ విద్యార్థుల అంశంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వెనక్కి తగ్గింది. విద్యార్థులపై ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకుంది. నల్సార్ విద్యార్థులు ఎక్కడైనా న్యాయవాదులుగా నమోదు చేసుకోవచ్చని బీసీఐ తెలిపింది. అధికశాతం మంది విద్యార్థులు అమాయకులని, వర్సిటీ స్నాతకోత్సవంలో సీజేఐ పాల్గొనడాన్ని వ్యతిరేకిస్తున్న ప్రచారంలో పాల్గొనే ఉద్దేశం వారికి లేదని తేలిన తర్వాత బీసీఐ ఈ మార్పు చేసింది.అధికశాతం మంది విద్యార్థులు అమాయకులు ఈ సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో బీసీఐ ఛైర్మన్ ఇలా అన్నారు. 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నల్సార్ లా వర్సిటీ వైస్- ఛాన్సలర్, అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల కార్యదర్శులకు ఈ రోజు జారీ చేసిన లేఖపై కౌన్సిల్ క్షుణ్ణంగా చర్చించి, మంతనాలు జరిపింది. చర్చల అనంతరం, తాజా నివేదిక ప్రకారం, నల్సార్ విద్యార్థులలో(2026లో ఉత్తీర్ణులయ్యే వారిలో) అధికశాతం మంది అమాయకులని, ఈ అగౌరవ చర్యలో పాల్గొనేందుకు సముఖంగా లేరని సభ్యులు ఏకాభిప్రాయానికి వచ్చారు' అని పేర్కొన్నారు. తదనుగుణంగా, రాష్ట్ర బార్ కౌన్సిళ్లలో నల్సార్ విద్యార్థుల నమోదుపై నిషేధానికి ఇంతకు ముందు ఇచ్చిన ఉత్తర్వులను కౌన్సిల్ సవరిస్తుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.అంతకు ముందు.. సీజేఐకి వ్యతిరేకంగా నల్సార్ యూనివర్సిటీ విద్యార్థుల ప్రవర్తనపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆగ్రహం వ్యక్తం చేసింది. సీజేఐ నుంచి పట్టాలు అందుకోబోమని ఇటీవల నల్సార్ విద్యార్థులు ఉపకులపతి(వీసీ)కి లేఖ రాశారు. ఈ ఘటనపై ఆగస్టు 19వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని వర్సిటీ వీసీని బీసీఐ ఆదేశించింది. ఆ నివేదిక ఆధారంగా విద్యార్థులపై తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొంది. అప్పటి వరకు నల్సార్ విద్యార్థులు ఏ బార్ కౌన్సిల్‌లోనూ నమోదు చేసుకోవద్దని బీసీఐ స్పష్టం చేసింది.

# ట్యాంపరింగ్ చేయలేరు కలర్ జిరాక్స్ తీయలేరు 9 కీలక సెక్యూరిటీ ఫీచర్లతో సిద్ధమైన స్మార్ట్ రేషన్‌కార్డులు

**పంపిణీకి సిద్ధమైన స్మార్ట్ రేషన్ కార్డులు**

**ట్యాంపరింగ్‌కు వీలులేకుండా 9 కీలక సెక్యూరిటీ ఫీచర్లు**

**1.05 కోట్ల స్మార్ట్ కార్డులు సిద్ధం రేపు సంగారెడ్డిలో**

**లబ్ధిదారులకు అందించనున్న సీఎం**

**స్మార్ట్ రేషన్ కార్డులోని సెక్యూరిటీ ఫీచర్లు**

కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. 9 కీలక సెక్యూరిటీ ఫీచర్లతో ట్యాంపరింగ్ చేయడానికి వీల్లేకుండా కొత్త కార్డులను తయారు చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో కూడిన కార్డు నమూనాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రేపు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి ఈ స్మార్ట్ కార్డులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నారు.ట్యాంపరింగ్‌కు అవకాశం లేని విధంగా కొత్త స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని శనివారం సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించి లబ్ధిదారులకు అందించనున్నారు. ఈ నేపథ్యంలో కొత్త స్మార్ట్ రేషన్‌కార్డుల నమూనా, సెక్యూరిటీ ఫీచర్లను పౌర సరఫరాల శాఖ అధికారికంగా వెల్లడించింది. 9 కీలక సెక్యూరిటీ ఫీచర్లతో ట్యాంపరింగ్‌కు అవకాశం లేనివిధంగా స్మార్ట్ రేషన్‌కార్డులు తయారు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. కార్డుపై సీఎం రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ఉంటాయని పేర్కొంది.స్మార్ట్ రేషన్ కార్డులోని సెక్యూరిటీ ఫీచర్లు స్పర్శతో గుర్తించేలా ఏర్పాట్లు : స్మార్ట్ రేషన్ కార్డు ముందు వైపు సీఎం, పౌర సరఫరాల శాఖ మంత్రి ఫొటోతో పాటు రేషన్ కార్డు నంబరు, షాపు నంబరు, కుటుంబ యజమాని పేరును ముద్రించారు. కార్డు ముందు వైపున కింద భాగంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ సంతకం, కార్డు వెనక వైపున కింద 16 శ12 మిల్లీమీటర్ల సైజులో రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నం హోలోగ్రామ్ ఉంటుంది. ముందు వైపు పైభాగంలో చేతితో తాకితే స్పర్శ ద్వారా గుర్తించేలా గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ అనే ఇంగ్లీష్ అక్షరాలు ఉంటాయి. తద్వారా కలర్ జిరాక్స్, ప్రింటింగ్ ద్వారా డూప్లికేట్ చేయడానికి వీలు కాకపోవడంతో పాటు ప్రీమియం లుక్ ఉంటుందని ప్రభుత్వం తెలిపింది.భూతద్దంతో చూస్తేనే కనిపించే ఇమేజ్‌లు : కార్డు రెండు వైపులా బ్యాంకు నోట్లు, పాస్‌పోర్టు, ఇతర హైసెక్యూర్డ్ డాక్యుమెంట్లపై ఉండేలా అతి సూక్ష్మ అక్షరాలతో ఇంగ్లీషులో గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ అని రాసి ఉంటుంది. సాధారణ కంటికి కనిపించని ఆ అక్షరాలు ప్రింటింగ్ ద్వారా కాపీ చేయడానికి వీలుండదని ప్రభుత్వం పేర్కొంది. వెనక వైపు కింది భాగంలో ' అనే హిడెన్ ఇమేజ్‌లు ఉంటాయని తెలిపింది. నిర్దిష్ట కోణంలో లేదా భూతద్దం ద్వారా చూస్తేనే అవి కనిపించనున్నాయి. ఈ కొత్త ఫీచర్ వల్ల డూప్లికేట్ తయారు చేయడానికి వీలుండదని సర్కారు పేర్కొంది.డేటా నిర్ధారణ కోసం క్యూర్ కోడ్ : స్మార్ట్ రేషన్ కార్డు రెండు వైపులా మధ్యలో ప్రభుత్వ అధికార చిహ్నం వాటర్‌మార్క్ ఉంటుంది. లైట్‌లో మాత్రమే కనిపించే ఈ తరహా వాటర్ మార్క్ సాధారణంగా ప్రభుత్వ, లీగల్ డాక్యుమెంట్లపై వాడతారు. ముందు వైపున అల్ట్రావాయొలెట్ లైట్‌లో మాత్రమే కనిపించే రాష్ట్ర ప్రభుత్వ ఎంబ్లెమ్ ఏర్పాటు చేశారు. సాధారణ వెలుతురులో కనిపించని ఈ సెక్యూరిటీ ఫీచర్ వల్ల ఫేక్ డాక్యుమెంట్ సృష్టించడానికి వీలు కాకపోవడంతో పాటు అనుమానం వస్తే అధికారులు తనిఖీ చేసేందుకు అవకాశం ఉంటుంది. వెనకవైపు ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా ప్రభుత్వం ఇచ్చిన స్కానర్, సాఫ్ట్‌వేర్ ద్వారా మాత్రమే డేటా నిర్ధారించుకునే వీలుంటుంది.కార్డు పంపిణీ కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ : కార్డు వెనక వైపు గజిబిజి రేఖలతో కూడిన క్లిష్టమైన ప్రత్యేక డిజైన్ ఉంటుందని సర్కార్ వివరించింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3.42 కోట్ల లబ్ధిదారులకు గానూ 1.05 కోట్ల స్మార్ట్ రేషన్‌కార్డులు సిద్ధమయ్యాయి. ఈ కార్డుల కోసం వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా లబ్ధిదారులకు ఎదురయ్యే సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయనున్నారు.




# ‘నీటి కేటాయింపుల్లో పరిష్కారమైన అంశాలను తిరగతోడద్దు’ బ్రిజేష్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ వాదన

**రాష్ట్రం మొత్తం అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ వాదన**

**ఆయకట్టు ప్రకారం ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు జరగాలని వాదన**

**నేడు ప్రారంభం కానున్నతెలంగాణ ప్రతివాదనలు**



నీటి కేటాయింపుల్లో ఇప్పట ికే పరిష్కరించిన అం శాలను తిం ిగతో డకూడదని బ్రిజేష్ ట్రైబ్యునల్ ఎదుట రాష్ట్రం వాదనలు విని పి ంచింది. మునుపటి వినియో గం, కరవు పరిస్థితులు, గతంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల కేటాయి ంపులను పరిగణనలోకి తీసుకో వాలంది. దీర్ఘకాలికంగా నీటిని వినియోగించుకుంటున్న ప్రాజెక్టుల కేటాయింపులను కాపాడాలంటూ వాదనలు ముగించింది. తెలంగాణ ప్రతివాదనలు నేడు(శుక్రవారం) ప్రారంభం కానున్నాయి.ఇప్పటికే ఉన్న నీటి కేటాయింపులను తిరగదోడటానికి వీల్లేదని బ్రిజేష్ ట్రైబ్యునల్ ఎదుట ఆంధ్రప్రదేశ్ తన వాదనలు వినిపించింది. అంతర్రాష్ట్ర నదీ వివాదాల చట్టం 1956 నిబంధన 4(1) ప్రకారం, ఇప్పటికే పరిష్కారమైన అంశాలను తిరిగి ప్రస్తావించకూడదని తెలిపింది. శాస్త్రీయ పంట నీటి అవసరాల ప్రకారం కృష్ణా డెల్టా, ఖజ కాలువ, సాగర్ ప్రాజెక్టుల కింద ఇప్పటికే నీటి ఆదా సాధించాం, కొత్తగా వీటి కింద నీటిని ఆదా చేసే అవకాశం లేదని ఏపీ తరపు సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా వాదించారు.కరవు, ఎడారి ప్రాంతాలు పరిగణనలోకి నీటి కేటాయింపులకు పరీవాహక ప్రాంత పరామితులను ప్రాతిపదికగా తీసుకోలేమని బచావత్ ట్రైబ్యునల్, బ్రిజేష్ ట్రైబ్యునల్ రెండూ యాంత్రిక ఫార్ములాలు, శాతాల ఆధారంగా లెక్కలు కట్టడాన్ని తిరస్కరించాయని చెప్పారు. గత వినియోగం, కరవు పరిస్థితులు, ఇప్పటికే ఉన్న సాగునీటి ప్రాజెక్టుల కేటాయింపులను పరిగణనలోకి తీసుకోవాలని, దీర్ఘకాలికంగా నీటిని వినియోగించుకుంటున్న ప్రాజెక్టులకు ఉన్న కేటాయింపులను కాపాడాలని, పరీవాహకం బయట ఉన్న కరవు ప్రాంతాలు, ఎడారిగా ఉన్న ప్రాంతాలు సహా రాష్ట్రం మొత్తం అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని లాయర్ గుప్తా వాదించారు.నిర్దిష్ట నీటి కేటాయింపులు లేకపోతే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపులను రక్షించాలని కృష్ణా తొలి ట్రైబ్యునల్ ఏయే ప్రాజెక్టులకు నిర్దిష్టంగా నీటిని కేటాయించిందో ఆ కేటాయింపులను కూడా కొనసాగించాలని కోరారు. ఉమ్మడి ప్రాజెక్టులకు ఇప్పటికే నిర్దిష్ట నీటి కేటాయింపులు లేకపోతే రెండు రాష్ట్రాల్లోనూ ఉన్న స్థానిక ఆయకట్టును పరిగణనలోకి తీసుకుని ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేయాలన్నారు. రాష్ట్ర విభజన చట్టం 2014 షెడ్యూలు 11లో సూచించిన విధంగా ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేయాలని ఆ తర్వాత కూడా నీళ్లు అందుబాటులో ఉంటే కొత్త, ప్రతిపాదిత ప్రాజెక్టులకు ట్రైబ్యునల్ నీళ్లు ఇవ్వవచ్చని వాదించారు. బ్రిజేష్ ట్రైబ్యునల్ అదనపు అంశాలకు సంబంధించి ఇప్పటికే తెలంగాణ వాదనలు జరిగాయి. ఆ వాదనలపై ఆంధ్రప్రదేశ్ తన వాదనలను ముగించింది. ఏపీ వాదనలపై తెలంగాణ ప్రతివాదనలు నేడు ప్రారంభం కానున్నాయి.

# సీడ్ యాక్సెస్ రోడ్డులో ‘ఎస్ ’ఆకారపు మలుపులు అపోహలకు ప్రభుత్వం చెక్

**అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డుపై వస్తున్న విమర్శలకు తెరదించిన ప్రభుత్వం**

**ఎస్’ఆకారపు మలుపులపై దుష్ప్రచారం తగదన్న పురపాలక శాఖ**

**భావి అవసరాలను దృష్టిలో పెట్టుకుని సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మించినట్లు వెల్లడి**



కరకట్ట ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెడుతూ అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభమైందో లేదో అప్పుడే "మలుపుల రహదారి" అంటూ కొందరు విమర్శలు మొదలెట్టారు. ఈ 'ఆ' ఆకారపు మలుపుపై వస్తున్న అపోహలకు ప్రభుత్వం తెరదించింది. భవిష్యత్‌లో విజయవాడ--చెన్నై జాతీయ రహదారిని మణిపాల్ హాస్పిటల్ సమీపంలో అనుసంధానించే ఎలివేటెడ్ కారిడార్‌కు అనుగుణంగానే ప్రస్తుత రహదారి నిర్మాణం జరిగిందని స్పష్టం చేసింది. కేవలం ఇప్పటి ట్రాఫిక్ అవసరాల కోసమే కాదు రేపటి రాజధాని అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర ప్రణాళికతో సీడ్ యాక్సెస్ రహదారిని రూపొందించినట్లు స్పష్టం చేసింది.అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డులో కనిపిస్తున్న' ఆకారపు మలుపు యాదృచ్ఛికంగా వచ్చినవి కావని ప్రభుత్వం స్పష్టం చేసింది. భవిష్యత్‌లో చేపట్టనున్న సీడ్ యాక్సెస్ రహదారి ఫేజ్ --3లో కీలకమైన విజయవాడ చెన్నై జాతీయ రహదారి కనెక్టివిటీకి అనుగుణంగానే ప్రస్తుత నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపింది. మణిపాల్ హాస్పిటల్ సమీపంలో జాతీయ రహదారితో సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించేలా భవిష్యత్ కారిడార్‌ను ప్రణాళికలో పెట్టారు.ఈ కనెక్టివిటీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన భౌగోళిక పరిస్థితులు, రహదారి లింకులు, ట్రాఫిక్ నిర్వహణ అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. అంటే కనిపిస్తున్న 'మలుపు లోపం కాదు, భవిష్యత్ రహదారి నిర్మాణానికి అనుగుణంగా రూపొందించిన డిజైన్‌లో భాగమే. రాజధాని రవాణా వ్యవస్థను దీర్ఘకాలిక అవసరాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దే దిశగా ఈ నిర్మాణాన్ని చూడాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.రాజధాని రవాణా వ్యవస్థకు కీలక లింకులు సీడ్ యాక్సెస్ రహదారి వెనుక ఉన్న అసలు టార్గెట్ అమరావతికి శరవేగమైన, బహుముఖ రహదారి కనెక్టివిటీ కల్పించడమే. 2017లో రూపొందించిన ప్రణాళిక ప్రకారమే దొండపాడు నుంచి తాడేపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్‌కు అనుగుణంగా రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే అమరావతికి మంగళగిరి, విజయవాడ ప్రాంతాలతో కనెక్టివిటీ మరింత బలోపేతం కానుంది. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రహదారులు రాజధాని రవాణా వ్యవస్థకు కీలక లింకులుగా మారనున్నాయి.కృష్ణా కరకట్టపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం అమరావతి వైపు వచ్చే, వెళ్లే వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి రావడంతో కృష్ణా కరకట్టపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది. అందుకే ఈ రహదారిని కేవలం ఒక రోడ్డుగా కాకుండా రాజధాని భవిష్యత్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్‌లో కీలకమైన కారిడార్‌గా ప్రభుత్వం అభివర్ణిస్తోంది. రహదారి నిర్మాణంలో భవిష్యత్ అనుసంధానాలను ముందుగానే పరిగణనలోకి తీసుకోవడం వల్లే ప్రస్తుత డిజైన్‌లో కొన్ని ప్రత్యేక ఆకృతులు కనిపిస్తున్నాయని పురపాలక శాఖ వెల్లడించింది. జాతీయ రహదారి కనెక్టివిటీ, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, స్థానిక రహదారుల అనుసంధానం, ట్రాఫిక్ రద్దీ ఇలా అనేక అంశాలను కలిపి డిజైన్ రూపొందించినట్లు తెలిపింది. కాబట్టి 'ఆ' మలుపుపై సోషల్ మీడియాలో, ఇతర వేదికలపై జరుగుతున్న ప్రచారాన్ని వాస్తవాలతో పరిశీలించాలని ప్రభుత్వం సూచించింది.

# ప్రజలకు అందుబాటులోకి సనత్‌నగర్ ‘టిమ్స్’17న ప్రారంభించనున్న రేవంత్‌రెడ్డి

**రూ.1,070 కోట్ల వ్యయంతో 1,082 పడకలతో నిర్మాణం . మొదట 582 పడకలతో సేవలు**

**అక్టోబర్‌కు పూర్తిస్థాయిలో అందుబాటు . నిమ్స్ తరహాలో స్వయంప్రతిపత్తి హోదాతో**

**కార్యకలాపాలు**





నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మించిన సనత్‌నగర్‌లోని మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎంసీఆర్ టిమ్స్) ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి ప్రాంగణంలో 22.6 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,070 కోట్ల భారీ బడ్జెట్‌తో దీన్ని నిర్మించారు. మొత్తం 1082 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రిలో తొలిదశలో 582 పడకలతో సేవలను ప్రారంభించనున్నారు. మిగిలిన 500 పడకలు ఈ ఏడాది అక్టోబర్ నాటికి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే మే నెల నుంచి ఓపీ విభాగంలో ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా, రోజూ 200 నుంచి 250 మంది వరకు రోగులు చికిత్స పొందుతున్నారు.ఈ ఆసుపత్రి ప్రధానంగా నాలుగు కీలక విభాగాలకు కేంద్రంగా నిలవనుంది. కార్డియాక్ (గుండె సంబంధిత), నెఫ్రాలజీ-యూరాలజీ (మూత్రపిండాల సంబంధిత), అవయవ మార్పిడి, ట్రామా విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నారు. వీటికి అనుబంధంగా మరో 37 విభాగాలు పనిచేస్తాయి. ఈ ఆస్పత్రికి నిమ్స్ తరహాలోనే స్వయంప్రతిపత్తి హోదా కల్పించారు. దీంతో నిధులను సొంతంగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే, తొలి ఐదారేళ్ల పాటు ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందిస్తుంది.వాస్తవానికి, గత ఏడాది డిసెంబర్‌లో, ఆ తర్వాత ఉగాదికి ఈ ఆసుపత్రిని ప్రారంభించాలని భావించినా, పనులు పూర్తికాకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు అన్ని పనులు పూర్తికావడంతో ప్రభుత్వం దీనిని ప్రారంభించేందుకు సిద్ధమైంది.

# 130 జలాశయాల్లో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుపై అధ్యయనం ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి

**ఆంధ్రప్రదేశ్ ఇంధన రంగంలో కీలక మార్పులకు మార్గం సుగమం**

**విద్యుత్ రంగంపై సీఎం చంద్రబాబు సమీక్ష**



రాష్ట్రంలోని 130 జలాశయాల వద్ద పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టుల (పీఎస్‌పీ) ఏర్పాటు , ఆర్థిక సాధ్యాసాధ్యాలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఇంధన శాఖ అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో గురువారం జరిగిన విద్యుత్ శాఖ సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు.విద్యుత్ ఉత్పత్తి పెంచేలా ప్రణాళికలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 130 జలాశయాల వద్ద పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై, ముఖ్యంగా వాటి ఆర్థిక లాభదాయకతపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో విద్యుత్ రంగంపై జరిగిన సమీక్షా సమావేశంలో పోలవరం వద్ద హ్రా ప్రాజెక్టు ఏర్పాటు ప్రతిపాదనపై చర్చిస్తూ ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "రాష్ట్రంలో విద్యుత్ వినియోగం ప్రతి ఆరేళ్లకు రెట్టింపు అవుతోంది. ఈ పెరుగుదలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలి. విద్యుత్ పంపిణీ నష్టాలను మరింత తగ్గించే చర్యలు తీసుకోవాలి. సరసమైన ధరలకు విద్యుత్ లభ్యతను కల్పించేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నందున జలవిద్యుత్ ఉత్పత్తి సాధ్యం కాకపోవచ్చు, కాబట్టి ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ముందుస్తు చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.6 లక్షల సోలార్ యూనిట్లను ఏర్పాటు సౌర విద్యుత్ ఉత్పత్తిని గరిష్ఠం చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 'పీఎం సూర్య ఘర్ పథకం కింద సెప్టెంబర్ నాటికి 6 లక్షల సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి, మరో 3 లక్షల కనెక్షన్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. అదనంగా, మరో 10 లక్షల కనెక్షన్ల కోసం రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ల విషయంలో కేంద్రానికి దరఖాస్తు చేయాలి!పీఎం కుసుమ్ పథకం కింద ఫీడర్ల వద్ద మినీ-సోలార్ యూనిట్ల ఏర్పాటును పూర్తి చేయాలి. అదనంగా 2,000 మెగావాట్ల కేటాయింపు కోసం కేంద్రాన్ని కోరాలి" అని ఆయన చెప్పారు. "ఈ ఏడాది విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని యూనిట్‌కు రూ. 4.60కి తగ్గించేలా చర్యలు తీసుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు.విద్యుత్ సంస్థలకు రేటింగ్స్: రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల పనితీరు ఆధారంగా వాటికి రేటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. "విద్యుత్ సంస్థలపై ఉన్న రుణ భారాన్ని తగ్గించాలి. తక్కువ వడ్డీ రేట్లను పొందేందుకు ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరపాలి" అని ఆయన అన్నారు. విద్యుత్ సంస్థలలో 'డిజిటల్ ట్విన్' వ్యవస్థలు 'అసెట్ హెల్త్ ఇండెక్స్' విధానాలను అమలు చేస్తున్నందుకు అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com